# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి


బోర్లం గురుకుల కళాశాలలో మాట్లాడుతున్న నోడల్ అధికారి షేక్ సలాం


మైనార్టీ గురుకుల పాఠశాలలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న నోడల్ అధికారి

**నోడల్ అధికారి షేక్ సలాం**

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 9 : రాబోయే ఇంటర్ పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేందుకు అధ్యాపకులు ప్రణాళిక ప్రకారం బోధించాలని జిల్లా ఇంటర్ మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి షేక్ సలాం అన్నారు. శనివారం బోర్లం మైనార్టీ గురుకుల పాఠశాల/కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, ల్యాబ్ సెంటర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటర్ విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కళాశాల మంచి ఉత్తీర్ణత సాధించాలంటే విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, అధ్యాపకులు సునీత, లక్ష్మణ్ ఉన్నారు.

## ఎమ్మెల్యే పోచారానికి శుభాకాంక్షల వెల్లువ


ఎమ్మెల్యే పోచారానికి శుభాకాంక్షలు తెలుపుతున్న శివాజీ యూత్ సంఘం సభ్యులు

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 9 : అసెంబ్లీ ఎన్నికల్లో బాన్సువాడ శాసన సభ సభ్యుడిగా పోచారం శ్రీనివాసరెడ్డి విజయం సాధించడంతో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం కలిశారు. శివాజీ యూత్ సంఘం సభ్యులు శనివారం హైదరాబాద్‌లో వారి అధికారిక గృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్, సాయాగౌడ్, సంగయ్య, విజయ్‌కుమార్, భాస్కర్, చింటు, సాయి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి ప్రజావాణి

కామారెడ్డి, డిసెంబర్ 9 : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 11వ తేదీ నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. ప్రస్తుతం శాసనసభ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున సోమవారం నుంచి కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశం మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి ప్రజావాణి కార్యక్రమం తిరిగి యథావిధిగా నిర్వహించనున్నామని, ప్రజలు గమనించాలని తెలిపారు.

### రేపు తోట హనుమాన్ ఆలయంలో కోటిదీపార్చన

బాన్సువాడ, డిసెంబర్ 9 : బీర్కూర్ మండలంలోని తోట హనుమాన్ ఆలయంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు కోటిదీపార్చన కార్యక్రమం నిర్వహించనున్నట్లు అయ్యప్ప గురుస్వామి కొండల్‌వాడీ మాదప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### కడుపు నొప్పి భరించ లేక యువకుడి ఆత్మహత్య

భిక్కనూరు, డిసెంబర్ 9 : కడుపు నొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన ప్రశాంత్(29) కొన్ని రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించినా నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికిగురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

### ముసుగు తొలగించేదెప్పుడు..


కోడ్ ఎత్తివేసినా ముసుగు తీయని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం

కామారెడ్డి, డిసెంబర్ 9 : రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కామారెడ్డి పట్టణంలో పలు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. ఎన్నికల కోడ్ ఎత్తి వేసినప్పటికీ కామారెడ్డిలోని స్టేషన్ రోడ్ లోని ఏరియా దవాఖాన వద్ద ఉన్న మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఉన్న ముసుగును తొలగించలేరు. ఎన్నికలు ముగిశాయి, ఫలితాలు వచ్చాయి, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడింది. కానీ.. విగ్రహానికి ఉన్న ముసుగును తొలగించలేదు.

## చురుగ్గా కొనసాగుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 9 : బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపు నుంచి బోర్లం వరకు రూ.1.20 కోట్లతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వంలో స్పీకర్‌గా పని చేసిన ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి నిధులు మంజూరు చేశారు. రోడ్డు నిర్మాణంతో బోర్లం గ్రామంతోపాటు బోర్లం క్యాంపు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. ఏండ్ల తరబడి సింగిల్‌గా ఉన్న రోడ్డును డబుల్ రోడ్డుగా వేస్తుండడంతో రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే బోర్లం మీదుగా బాన్సువాడ వెళ్లేందుకు తక్కువ సమయం పడుతుందని వారు పేర్కొంటున్నారు.


బోర్లం క్యాంపు తండా నుంచి బోర్లం వరకు వేస్తున్న బీటీ రోడ్డు

## లింబాద్రిగుట్టకు పోటెత్తిన భక్తులు


అన్నసత్రంలో భక్తుల సందడి

భీమ్‌గల్, డిసెంబర్ 9 : పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం లింబాద్రిగుట్ట లక్ష్మీ నర్సింహస్వామి ఆలయానికి భక్తులు శనివారం పోటెత్తారు. కార్తికమాస శనివారం నేపథ్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో గుట్టకు తరలిరావడంతో స్వామి దర్శనానికి బారులు తీరారు. కాలినడకన గుట్టకు చేరుకొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో గుట్టపై సందడి నెలకొన్నది. దర్శనం అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు


కామారెడ్డిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కామారెడ్డి/భిక్కనూరు/మాచారెడ్డి/బీబీపేట్/దోమకొండ/నస్రుల్లాబాద్, డిసెంబర్ 9 : కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోనియా గాంధీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. దవాఖానల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కామారెడ్డిలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. భిక్కనూరు మండలం జంగంపల్లి, బీబీపేట్, మాచారెడ్డి, దోమకొండ, నస్రుల్లాబా ద్ మండలాల్లో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.

## ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి

కోటగిరి, డిసెంబర్ 9 : 2024, జనవరి 1వ తేదీ నాటికి 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ జనవరి 5వ తేదీలోగా ఓటు హక్కు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోటగిరి, పొతంగల్ మండలాల తహసీల్దార్లు ప్రభాకర్, రమేశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల మార్పు, చేర్పుల కోసం ఈనెల 20 నుంచి జనవరి 5 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. జనవరి 6న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన, జనవరి 8న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మాక్లూర్, డిసెంబర్ 9 : మండలంలోని బోర్గాం(కే) గ్రామ శివారులోని ముసలికుంట చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభించినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని చెరువులో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభించిందని, మూడు రోజుల క్రితం చెరువులో పడి ఉంటాడని, మృతుడి వయస్సు సుమారు 58 సంవత్సరాలు ఉంటాయని వెల్లడించారు. తెల్ల గడ్డం, నల్ల ,ఎర్రని చారలు కలిగిన చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానాకు తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం మాక్లూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై సూచించారు.